క్లుప్తంగా

మిత్రుల చేయూత



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌కు చెందిన పేరాల మహేష్ ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని మహేష్ స్నేహితులు మంగళవారం పరామర్శించారు. అనంతరం వారు జమ చేసిన రూ.54,500ల నగదును మహేష్ కుమార్తె మనస్విని పేరిట పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండును కుటుంబీకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేష్ స్నేహితులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కమలాపూర్ : ప్రమాదవశాత్తు బోర్లాపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గూడూరుకు చెందిన గూడెల్లి రాజయ్య (55) మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ మంగళవారం తెలిపారు. మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన రాజయ్య సోమవారం మధ్యాహ్నం వ్యవసాయ పనులకు ఇంటి నుంచి బయలుదేరి కొద్ది దూరం వెళ్లాడు. ఈక్రమంలో అతడి లుంగీ ప్రమాదవశాత్తు కాళ్లకు తట్టుకుని కిందపడ్డాడు. ఎవరో ఏడ్చినట్లు శబ్దం రావడంతో రాజయ్య భార్య లలిత వెళ్లి చూడగా రాజయ్య బోర్లా పడి ముక్కు నుంచి రక్తం కారుతూ కనిపించాడు. వెంటనే 108 ద్వారా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు. లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

ఆత్మకూరు : మానసిక బాధలు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని అక్కంపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. అక్కంపేటకు చెందిన పెండ్లి సారంగం (55) కొడుకు, కోడలు ఆరునెలల క్రితం విడిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో జూలై 31న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించగా మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు ఆత్మకూరు సీఐ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెర్ప్ ఉద్యోగులకు సన్మానం

గీసుకొండ : మండలంలోని ప్రగతి మండల సమాఖ్య కార్యాలయంలో సెర్ప్ సీసీగా ఉద్యోగ విరమణ పొందిన గడ్డి అశోక్‌ను, ఐనవోలు మండలానికి బదిలీ అయిన క్రమంలో ఏపీఎం సురేశ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షురాలు గట్టు రాధిక అధ్యక్షత వహించి మాట్లాడారు. సెర్ప్ ఉద్యోగుల సేవలను అభినందించారు. పొదుపు సంఘాల బలోపేతానికి కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు కోల శోభ, కక్కెర్ల సుజాత, సమాఖ్య మండల కార్యదర్శి శారద, సెర్ప్ ప్రతినిధులు శిల్ప, జయంతి, నాగరాజు, వీఓఏలు జనార్దన్, రవి, రాజు, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రవాణాపై రైతుల ఆగ్రహం

- ట్రాక్టర్‌ను అడ్డుకొని అప్పగింత
- సీజ్ చేసి కేసు నమోదు చేసిన పోలీసులు



ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకున్న రైతులు

కమలాపూర్ : అక్రమంగా ఇసుక తరలింపుతో భూగర్భ జలాలు అడుగంటి పోయి పంటల సాగుకు నీరందక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మంగళవారం రాత్రి కమలాపూర్ మండలంలోని నేరెళ్లలో చోటు చేసుకుంది. రైతులు తెలిపిన కథనం ప్రకారం .. మండలంలోని నేరెళ్ల వాగు నుంచి ఇష్టారాజ్యంగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని, దీంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని రైతులు ఆందోళనకు దిగారు. ఇటీవల మండల అధికారులు ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక రవాణా చేయాలని, అందుకు కేవలం రవాణా చార్జీలు మాత్రమే తీసుకోవాలని, అందుకు టోకెన్లు జారీ చేస్తున్నామని చెప్పిన కొందరు ఇసుక అక్రమ వ్యాపారులు ఎలాంటి టోకెన్లు లేకుండా వాగులోని ఇసుకను పలు ప్రాంతాలకు రవాణాకు చేస్తున్నారు. ఇలా రోజుకు 50 నుంచి వంద ట్రిప్పుల వరకు అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం రాత్రి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకోగా పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ డ్రైవర్ చెన్నూరి లింగయ్య, యజమాని దొంగల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమంగా మొరం రవాణా



14వ వార్డులోని ఖాళీ ప్లాట్‌లో నింపుతున్న మొరం



దామెర చెరువు నుంచి ట్రాక్టర్లతో తరలిస్తున్న మొరం

పేరుకే ఇందిరమ్మ ఇళ్లకు.. తరలించేది ప్రైవేట్ ప్లాట్లకు..

- 300 ఇళ్లకు.. 20 వేలకు పైగా ట్రిప్పుల మొరం
- లబ్ధిదారుడికి రూ.600.. ప్లాట్లకు రూ.800 వసూలు
- పట్టించుకోని అధికారులు

పరకాల : ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పేరుతో చెరువులోని మొరాన్ని ప్లాట్లకు అక్రమంగా తరలిస్తున్నారు. పరకాల, దామెర చెరువు నుంచి మొరం దందాకు పాల్పడుతున్నా అధికారులు మాత్రం ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. పరకాల పట్టణంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల బేస్‌మెంట్ లెవల్ కోసం పరకాల దామెర చెరువు నుంచి నెల రోజులుగా రోజుకు 50 నుంచి 70 ట్రాక్టర్ల ద్వారా మొరం, మట్టిని తరలిస్తున్నారు. వాస్తవానికి పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డుల్లో 467 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా 350 మందికి మాత్రమే ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వాటిలో కూడా 300 మంది లబ్ధిదారులే ఇంటి నిర్మాణ పనులు బేస్‌మెంట్ లెవల్ వరకు చేసుకున్నారు. ఒక్కో ఇంటికి 30 నుంచి 50 ట్రాక్టర్ల మొరం అవసరం ఉండగా దామెర చెరువు నుంచి రోజు 50 ట్రాక్టర్ల..



ట్రాక్టర్‌లో తరలిస్తున్న మట్టి

ఒక్కో ట్రాక్టర్ 15 నుంచి 20 ట్రిప్పుల మట్టిని తరలిస్తున్నారు. వర్షాలు పడిన నాలుగు రోజులు మాత్రమే విరామం ఇచ్చారు. కానీ ప్రొక్లెయినర్‌లు మాత్రం 30 రోజుల పాటు చెరువులోనే ఉంటూ మొరం తవ్వకాలు నిర్వహిస్తున్నాయి. అయినా అధికారులు పర్యవేక్షణ చేయక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అడ్డగోలుగా దోపిడీ..

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల లబ్ధిదారులకు ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.600 వసూలు చేస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్లు ప్రైవేటు ప్లాట్లకు రూ.700 నుంచి రూ.800 వసూలు చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో నెల రోజులుగా దామెర చెరువు నుంచి మొరం, మట్టి దందాకు పాల్పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం అటువైపు చూడకపోవడంతో విమర్శలకు తావిస్తోంది. చెరువులో చేపట్టినా తవ్వకాలను పరిశీలిస్తే కనీసం 25వేల ట్రిప్పుల మొరం తరలినట్లు తెలుస్తోంది. ఇంతా మట్టి ఇందిరమ్మ ఇళ్లకు చేరలేదని, కొంత వరకు మాత్రమే వెళ్లి.. చాలా వరకు ప్రైవేటు ప్లాట్లకు తరలినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గుంతలను మట్టితో పూడ్చాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం మాత్రమే చెరువులో మొరం తరలింపునకు అనుమతి ఇచ్చాం. బయట ప్రైవేటు ప్లాట్లకు తరలించకూడదు. చెరువులో మొరం తీసిన వెంటనే మట్టితో లెవల్ చేయాలి.

– విన్సెంట్ బాబు, ఏఈ, ఇరిగేషన్, పరకాల

అధికారులు పట్టించుకోవడం లేదు



ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లాల్సిన మొరంను ట్రాక్టర్ల యజమానులు ప్రైవేటు ప్లాట్లకు తరలిస్తున్నారు. కానీ అధికార యంత్రాంగం ఈ దందాను పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. చాలా మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇప్పటికే బేస్‌మెంట్ పనులు పూర్తి చేసుకుంటే ఇంకా మొరం తరలిస్తున్నా అధికారులు సైతం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

– చిన్నికృష్ణ, అంబేడ్కర్ సంఘం యూత్ అధ్యక్షుడు

బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి



నడికూడ: తల్లిపాల ప్రాముఖ్యంపై బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్



శాయంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

నడికూడ : బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి అన్నారు. మండలంలోని నర్సక్కపల్లి అంగన్‌వాడీ ఒకటి, రెండు, మూడు, నాలుగు కేంద్రాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరకాల ఆధ్వర్యంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని, ముర్రు పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని, తల్లి పాలు పట్టించడం వల్ల తల్లికి కూడా అధిక రక్తపోటు, దీర్ఘకాలిక జబ్బుల నుంచి రక్షణ కలుగుతుందన్నారు. గర్భిణులు,బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరిత, సుప్రియ, రజిని ఆయాలు రాధ, వనజ, ముత్యాలు, రమ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు రక్ష

శాయంపేట : తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని, రోగనిరోధక శక్తిని పెంచుతుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాయికృష్ణ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని తెలిపారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఒక వరం లాంటివని, వాటికి మించిన పౌష్టికాహారం మరొకటి లేదని, బిడ్డ పుట్టినరోజు నుంచి ఆరునెలల వరకు తల్లిపాలే తాగించాలని సూచించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై బాలింతలకు, గర్భిణులకు, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వెంకటేశ్వర వర్మ, చలపతి, మల్లేశం, ఏఎన్‌ఎం శ్రావణి, ఆశ కార్యకర్తలు కవిత, లత, ప్రేమలత, అంగన్‌వాడీ టీచర్లు జ్యోత్స్న, శ్వేత, కవిత, పుష్ప పాల్గొన్నారు.

మహాగర్జనను జయప్రదం చేయండి



శాయంపేట: సమావేశంలో మాట్లాడుతున్న విశ్వనాథ్, చిత్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు



దామెర: పసరగొండలో మాట్లాడుతున్న రవికుమార్

- ఎమ్మార్పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ విశ్వనాథ్

శాయంపేట/కమలాపూర్: హనుమకొండలో రేపు (గురువారం) ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన దివ్యాంగుల చేయూత మహా గర్జన సభకు దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ మామిడి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్ పెరుగుదలకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో తలపెట్టిన మహా గర్జన సభకు దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. హనుమకొండ జిల్లాలోని హసన్‌పర్తి మండలం చింతగట్టు ఎంటీఆర్ గార్డెన్‌లో నిర్వహించే సభకు మేధావులు, నాయకులు, దివ్యాంగులు, కవులు, కళాకారులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 13న హైదరాబాద్‌లో దివ్యాంగ, చేయూత పింఛన్ దారుల మహాగర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ కందుకూరి సోమన్న, నాయకులు తుడుం వెంకటేష్, మారెపల్లి చిరంజీవి, కనకం సురేందర్, జలుగూరి మహేష్, సామల భాస్కర్,ఎమ్మార్పీఎస్ కమలాపూర్ మండల ఇన్‌చార్జ్ శనిగరపు రవీందర్, నాయకులు నద్దునూరి ప్రసాద్, శనిగరపు జనార్దన్, ఇసంపెల్లి శంకర్, స్వామి, అంబాల సాంబయ్య, పాముకుంట్ల రమేష్, పూర్ణచందర్, కుమ్మరి సుధాకర్, రమేష్, అక్కినపల్లి రామ్మూర్తి, కొయ్యడ రమేష్ పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు న్యాయం చేయాలి

దామెర : ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పింఛన్‌దారులకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవిందు రవికుమార్ కోరారు. మండలంలోని పసరగొండలో మంగళవారం పింఛన్‌దారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పింఛన్ అమలు చేయాలన్నారు. ఆసరా, ఒంటరి మహిళలకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, కండరాల క్షీణత కలిగిన వ్యక్తులకు రూ.13వేలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మంద రాజేందర్, నల్లెల రజిత, గజ్జి సంపతి, శనిగరపు మమత, మహ్మద్ ఖాజావియా, మంద రమేష్, సౌజన్య, మేకల రమేష్, పరికరాల రమేష్, గొర్రె సురేష్, బొగ్గు రమ్య, రావుల రాజు, గుప్పిరెడ్డి సాంబయ్య పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ రామకృష్ణ

దామెర : సేంద్రియ వ్యవసాయంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏఈఓ రామకృష్ణ సూచించారు. నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్ కార్యక్రమంలో భాగంగా 125 మంది రైతులను ఎంపిక చేసి మంగళవారం అవగాహన కల్పించారు. ద్రవ జీవామృతం తయారు చేసే విధానాన్ని వారికి వివరించారు. సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. అదే విధంగా కలుషిత ఆహారం లేకుండా నాణ్యమైన దిగుబడి పొందే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. పూర్వ కాలంలో రైతులు ఇలాంటి వ్యవసాయ పద్ధతులు పాటించి ఆరోగ్యంగా జీవనం కొనసాగించారని స్పష్టం చేశారు.రైతులు బొల్లం వేణుగోపాల్, కాశెట్టి లక్ష్మణ్, గోపు రమేష్, ముంద్రాతి భిక్షపతి, సమ్మయ్య, అంకేశ్వరపు రాంబాబు పాల్గొన్నారు.

పత్తిపాకలో నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న భజన మండలి సభ్యులు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి సభ్యులు, శ్రీ రామదాసు భజన జిల్లా అధ్యక్షుడు మాందాడి రాజు ఆధ్వర్యంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం ఉదయం 5గంటల నుంచి 7గంటల వరకు గ్రామంలోని ప్రతి వీధిలో భక్తి గీతాలు ఆలపిస్తూ నగర సంకీర్తన చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. హిందూ ధర్మ ప్రచార పరిషత్, శ్రీరామదాసు భజన మండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆదర్శ ఆదేశాల మేరకు పదేళ్లుగా శ్రావణ మాసంలో నెల రోజుల పాటు గ్రామాల్లో నగర సంకీర్తనలు చేస్తున్నట్లు తెలిపారు. భజన మండలి సభ్యులు తడక సదానందం, కూనూరు రాజు, తుడుం కుమారస్వామి, కుసుమ రమేశ్, గజ్జి మహేందర్, పింగిళి సాంబరెడ్డి, తడుక రవి, నాలికె శంకర్, వైద్యుల ప్రభాకర్ రెడ్డి, రాంరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠ



హోమంలో పాల్గొన్న భక్తులు

దామెర : మండలంలోని ల్యాదెళ్ల గ్రామంలో మంగళవారం పోచమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మొదటిరోజు గ్రామతోరణం, అమ్మవారికి ఆహ్వానపూజ, పంచామృతాలతో అభిషేకాలు, శోభాయాత్ర, గణపతి పూజ, పుణ్యావాచనం, ధాన్యాధివాసం, హోమం పూజలను వేద పండితులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధూప, దీప, నైవేద్యాలు, సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు వీరమల్లయ్య మాట్లాడుతూ నేడు (బుధవారం) అమ్మవారికి బోనాలు సమర్పించే కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో కరుజుగుత్త రమేష్, అంబటి రాజు, డెంగు నవీన్, గునిగంటి రమేష్, సిందె శ్రీనివాస్, మాదాసు రమేష్, గ్రామస్తులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పాలనలో దేశాభివృద్ధి



దామెర: ప్రచారం చేస్తున్న శ్రీరాంరెడ్డి తదితరులు



ఆత్మకూరు: కరపత్రాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ కాళీప్రసాదరావు, బీజేపీ నాయకులు



ఐనవోలు: ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, నాయకులు

- బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి

దామెర : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి పేర్కొన్నారు. బీజేపీ మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం గడప గడపకు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని తెలిపారు. పదేళ్లుగా భారత్ ప్రపంచ దేశాలకు దీటుగా వృద్ధిరేటు సాధించడం మోదీ ముందుచూపుకు నిదర్శనమని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, నాయకులు ఎక్కలదేవి రమేష్, పెంట రమేష్, వంగ నాగరాజు, సండెసారి సంతోష్‌బాబు, ఎడ్ల కుమార్, మాదారపు సాంబయ్య, దామెరుప్పుల చంద్రయ్య, గూడూరు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల్లో అభివృద్ధి..

ఆత్మకూరు : గ్రామాల్లో అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. బీజేపీ మహాసంపర్క్ అభియాన్‌లో భాగంగా మంగళవారం మండలకేంద్రంలో ఇంటింటికి బీజేపీ ప్రతి ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు కార్యక్రమాన్ని నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాళీప్రసాదరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధికి నిధులు ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, బయ్యరాజు, కిసాన్‌మోర్చా నియోజకవర్గ కన్వీనర్ వంగాల బుచ్చిరెడ్డి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సముద్రాల రవి, మండల ప్రధాన కార్యదర్శులు బయ్యపైడి ఆచార్య, రవ్వ శివప్రసాద్, రాజు, సత్యనారాయణ, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు వేములపల్లి శ్రీలత, దశరథం పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

ఐనవోలు : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటే విధంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పంథిని గ్రామంలో బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ దొంతి రాజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికి బీజేపీ–ప్రతి గడపకు బూత్ అధ్యక్షుడు, మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్తినేని ధర్మారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యమని గడప గడపకు వెళ్లి బీజేపీ పాలనలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చిందన్నారు. స్థానిక ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాస్తోందని విమర్శించారు. పథకాలన్నీ కాంగ్రెస్ నాయకులకే దక్కుతున్నాయని ఆరోపించారు. అదే క్రమంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోదీ నేతృత్వంలో అనేక చట్టాలను ప్రజల ఆకాంక్షల మేరకు రూపొందిస్తోందన్నారు. దేశంలో అనేక ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్న విషయం ప్రజలకు తెలిసిందే నన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మాదాసు ప్రణయ్, జిల్లా, మండల నాయకులు అర్షనపల్లి శ్రీరామ్ భూపాల్, మల్లాడి తిరుపతిరెడ్డి, కనుకుట్ల రంజిత్, కళ్లెం వినయ్, విజ్జగిరి శివ, జితేంద్రరావు, మహేందర్, మహేష్, పూర్ణచందర్, రాజు, సునీల్ రెడ్డి, పుణ్య కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ధర్మసాగర్ : భారతీయ జనతా పార్టీ బూత్ స్థాయి కమిటీ అధ్యక్షుల సమావేశం రేపు (గురువారం) మధ్యాహ్నం జనగామ జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బైరపాక కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల బూత్ అధ్యక్షులు, గ్రామ కమిటీ సభ్యులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, మండల, జిల్లా నాయకులు హాజరు కావాలన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

పరకాల : రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పరకాల మున్సిపాలిటీపై భారతీయ జనతా పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని ఆ పార్టీ పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం బీజేపీ పరకాల శాఖ కార్యాలయంలో సర్వవ్యాప్తి–సర్వస్పర్శ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి బీజేపీ–ప్రతి గడపకు బూత్ అధ్యక్షుడు కార్యక్రమంలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్య పర్చాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి సంగా పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి, నాయకులు కుక్కల విజయ్‌కుమార్, పావుశెట్టి శ్రీనివాస్, మిడిదొడ్డి నరేష్, సునీత, దార్న సునీల్, వెనిశెట్టి శారద, ఆకుల శ్రీధర్, ముత్యాల దేవేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ముల్కనూర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

- ముల్కనూరులో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఎల్కతుర్తి : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు జక్కుల భానుప్రసాద్ డిమాండ్ చేశారు.మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ అంబేడ్కర్ చౌక్ వద్ద హనుమకొండ–సిద్దిపేట ప్రధాన రహదారిపై విద్యార్థి నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జక్కుల భానుప్రసాద్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఓట్లు లేవని వారిని విస్మరిస్తున్నారని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యార్థుల సత్తా ఏంటో చూపిస్తామని ఆయన హెచ్చరించారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు, బెస్ట్ అవైలబుల్ స్కూల్ బిల్లులు, వివిధ వసతి గృహాల వార్డెన్ల మెయింటెనెన్స్ బిల్లులు రాక తీవ్ర ఇబ్బందుల పడుతున్నారని వాటిని సైతం విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కొండ చరణ్, తాళ్ల సిద్ధార్థ, పెండ్యాల సుమంత్, అభిలాష్, వర్షిత్, విఘ్నేష్, విశ్వతేజ, రామ్‌చరణ్, కపిల్, విష్ణువర్ధన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

- వ్యవసాయ శాస్త్రవేత్త నాగభూషణం

గీసుకొండ : ఎరువుల వినియోగంలో రైతులకు అవగాహన ఉండాలని సీనియర్ వ్యవసాయ శాస్త్రవేత్త నాగభూషణం స్పష్టం చేశారు. రైతు విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మండలంలోని పలు గ్రామాల్లోని పంట చేలను మంగళవారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా శాస్త్రవేత్త నాగభూషణం రైతులకు సూచనలు అందించారు. పంట చేలకు ఎరువులను తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు వేస్తే అధిక ప్రయోజనం ఉంటుందని తెలిపారు. వరిలో గడ్డి జాతి కలుపు మొక్కల నివారణకు సిఫార్సు చేసిన మందులను పిచికారీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ హరిప్రసాద్‌బాబు, శాస్త్రవేత్తలు విజయభాస్కర్, విశ్వతేజ, ఏఈఓలు సంపత్, రజని, తదితరులు పాల్గొన్నారు.